అక్క పెళ్ళి

"ఆయనకేం? మహారాజు! ఇంకా ఇద్దరు కూతుళ్ళున్నా అవలీలగా సంబంధాలు తీసుకురాగలడు!" అని తనను గురించి ఎవరన్నా స్నేహితులు అనుకున్నప్పుడు శ్వేతాంబరానికి కొద్దిగా గర్వమూ, అంతకంటె ఎక్కువ భయమూ కలిగేవి.

తన శక్తిలో తనకే లేని నమ్మకం తన స్నేహితుల కెందుకుండాలి? ఒకవేళ తాను హనుమంతుడల్లే తన శక్తి సామర్థ్యాలను గుర్తించలేకుండా ఉన్నాడా? అయితే, తనకూ, హనుమంతుడికీ ఒక్క విషయంలో మటుకు పోలికలేదు— హనుమంతుడు పొగిడితే విజృంభించేవాడు. దిక్కుమాలిన పొగడ్త తనను కుంగదీస్తోంది.

రెండు సంవత్సరాలుగా కళ్యాణికి తగినవాడెక్కడన్నా దొరుకుతాడా అని వెయ్యికళ్ళతో చూస్తున్నాడు. భూమ్యాకాశాల మధ్య అటువంటి వాడెవడూ ఇంత వరకు కనిపించలేదు. "ఎవరన్నా కాస్త సహాయపడండర్రా!" అని ఆప్తులనూ, మిత్రులనూ అడుగుదామన్నా వాళ్ళు తన అసహాయస్థితి గుర్తించేటట్టు లేరు.

"శ్వేతు పెద్దదానికింకా పెళ్ళి చేశేడు కాడేం?"

"ఆఁ ఇవాళ అనుకున్నాడంటే రేపు చేసేస్తాడు. మనవాడి కది ఏమంత కష్టమైన పని కాదులే!"

తన బంధువు లిద్దరిమధ్య జరిగిన ఈ సంభాషణను శ్వేతాంబరం తన చెవులారా విన్నాడు. తాను వింటున్నట్టు వాళ్ళకి తెలీదు; అందుచేత అవి ఇచ్చకాల మాటలనుకోవటానికి లేదు....

అవును, తన అసమర్థత ఒక్కరూ గమనించరు. ఆ కారణంచేత తాను బొత్తిగా ఒంటరిగాడై పోయినాడు. అంతకంటె తనకు కలిగిన లాభం ఆవగింజంత కూడాలేదు. అన్ని విషయాలలోనూ తనను నిశితంగా విమర్శించే తన భార్య గుణమణి కూడా, "మీరు పని పెట్టుకుని వెతికితే క్షణంలో దానికి సంబంధం కుదరక పోయిందా? మీ కసలు ఈగవాలినట్టయినా ఉంటేగా?" అంటుంది తప్ప "ఇది నీవల్ల అయే పనికాదు, మరెవరికన్నా పురమాయించు" అనదు....

తనలో ఇంతమందికి విశ్వాసం ఉండటానికి గల కారణాలు శ్వేతాంబరానికి తెలియకపోలేదు. ఆరేడు వందల రూపాయల జీతగాడు, పలుకుబడి గలవాడు, "నా కూతురికి పెళ్ళి చేస్తున్నాను!" అన్నాడంటే ఎంతమందో కుర్రాళ్ళు ఎగబడక పోతారా అని కొందరు బంధువుల నమ్మకం! ఎంతమంది స్నేహితుల కూతుళ్ళకో సంబంధాలు కుదిర్చాడు. తన కూతుళ్ళకు కుదర్చలేడా అని మరి కొందరి ఉద్దేశం!

ఇదంతా నిజమే అనుకున్నా, కళ్యాణికి మొగుణ్ణి తీసుకు రావటానికి చిన్న మెత్తు ఉపకరించలేదు——అది అసలైన నిజం. కొందరు పెద్దమనుషులు తమకు తామై వచ్చి, "మీ పిల్లను మావాడికి చేసుకుంటాం," అని అడగటమూ, ఇతరుల ద్వారా అడిగించటమూ జరిగింది. కాని అట్లా వచ్చిన సంబంధాలలో ఒక్కటి కూడా గుణమణి ఆమోదించలేదు.

గుణమణి ఆక్షేపించుటలో అఖండురాలు. ఎంటువంటివాళ్ళకైనా వంకలు పెడుతుంది——వాళ్ళంటే తనకు ఇష్టం లేకపోతే ! "ఆవిడకి హృదయనేత్రమే తప్ప మనోనేత్రం లేదు. ఒకప్పుడుండేదేమో, ఇప్పుడు పువ్వేసి పోయింది," అని ఒక కవి మిత్రుడు తాను పూర్వం ప్రేమించిన ఒక గొప్ప ఇంటి ఇల్లాలిని గురించి శ్వేతాంబర దగ్గిర విరక్తిగా అన్నాడు. ఆ వర్ణన గుణమణికికూడా వర్తిస్తుందని శ్వేతాంబరానికి ఎన్నోసార్లు అనిపించింది. గుణ మానవులందర్నీ రెండు తరగతులుగా విభజించింది——తన కిష్టులైనవాళ్ళూ, కానివాళ్ళూనూ ! ఇష్టులైనవాళ్ళలో ఆమెకు ఏ ఒక్క లోపమూ కనిపించదు. అధవా కనిపించినా ఎంతో హృదయ వైశాల్యత కనబరిచి ఆ లోపాన్ని క్షమిస్తుంది, సమర్ధిస్తుంది, వీలయితే మెచ్చుకుంటుంది కూడా.

గుణకి తన పెద్దకూతురు కళ్యాణిమీద చాలా ప్రేమ. "పాపం, దానికి ఏమీ తెలీదు——సీత ఇంకా గడుసుదిగాని...అందుకే దానికి మంచి సంబంధం చూడాలి!" అనేది. ఈ 'మంచి' సంబంధం ఎట్లా ఉంటుందో శ్వేతాంబరానికి ఎన్నడూ అర్థం కాలేదు. కళ్యాణిని చేసుకుంటామని వచ్చిన సంబంధాలలో చాలాభాగం తనకూ నచ్చని మాట నిజమేగాని, తాను కష్టపడి వెతికినా ఇంచుమించు అటువంటి సంబంధాలు తప్ప కళ్యాణికి రావని ఆయన నమ్మకం.

ఆమాట అంటే గుణ, "మీకు అదంటే చాలా తేలికలెస్తురూ!" అంటుంది.

"నీ కళ్ళకి నీ కూతురు రంభల్లే కనిపించగానే సరా ?" అంటాడు శ్వేతాంబరం.

"అదే నాకర్థంకాదు. మీ కళ్ళకి మాత్రం రంభల్లే ఎందుకు కనిపించకూడదూ ? మీ కూతురు కాకపోయిందా ?" అంటుంది గుణ.

"నీ మాదిరిగా ఆత్మవంచన చేసుకోవటం నాచేతకాదు."

"ఇష్టమైతే అన్నీ చాతవుతై !"

"పోనీ ఇష్టంలేదే అనుకో !"

"ఎందుకు లేకపోవాలి? అదే నాకర్థంకాదు."

"ఇష్టమైతే అదే అవుతుందని నేను కూడా అనవచ్చా?"... ఒక పావుగంట సేపు ఈ ధోరణిలో పడ్డాక, తాము ప్రారంభించిన విషయానికీ మాట్లాడుతున్న మాటలకూ సంబంధం లేకుండా పోయిందని శ్వేతాంబరానికి అర్థమయేది.

"నీతో ఏది మాట్లాడాలన్నా చిక్కే, అసలు విషయం వదిలేసి ఎటో ఈడుస్తావు !" అని విసుక్కునే వాడాయన.

"నేనా ! ఇంకానయం ! మీరే ఈడుస్తారు—దాని పెళ్ళి విషయం ఎత్తితే చాలు మీకు కోపం ! అదంటే మీకు బొత్తిగా గిట్టదు. అందుకని మీరే మాట మార్చేసి, ఇంకేదో మాట్లాడతారు" అనేది గుణ పూర్తి నమ్మకంతో.

తన భర్తకు కళ్యాణి అంటే ఇష్టంలేదని రుజువు చెయ్యటానికి గుణమణి దగ్గిర బోలెడంత సాక్ష్యం వుంది. ఊళ్ళోవాళ్ళందరికీ సంబంధాలు కుదర్చగలడు గాని, తన కూతురుకి కుదర్చడు ! తాను పెళ్ళికొడుకు తండ్రి అయినట్టుగా కళ్యాణిలో లోపాలెన్నుతాడు ! అదికూడా ఎందుకు ?— మంచి సంబంధం వెతక్కుండా తప్పించుకోవటానికి. సరస్వతమ్మగారి సుశీలకు ఈయనేగా సంబంధం కుదిర్చిందీ ! దానికి అంత మంచి మొగుడు వస్తాడని సరస్వతమ్మ కలలోనైనా అనుకొని ఉంటుందీ ? ఊళ్ళో వాళ్ళ కూతుళ్ళకు చేసేదానికన్న కన్నకూతురుకు ఎవరన్నా కాస్త ఎక్కువగానే జరుపుకోవాలా, వద్దా ?

తన భార్య ఈ ధోరణిలో పడ్డప్పుడు శ్వేతాంబరం అస్త్రసన్యాసంచేసి వింటూ ఉండిపోయేవాడు. ఎందుకంటే గుణ అనే మాటల్లో వాక్యానికి రెండేసి అబద్ధాలుంటాయి. సరస్వతమ్మ కూతురు సుశీలకూ, కళ్యాణికి ఏమీ పోలికలేదు. సుశీల చాలా తీరైనపిల్ల. తెలివిగలది. ఆ పిల్లకు వచ్చిన సంబంధం గుణ చెప్పేటంత గొప్పది ఏమీకాదు. పిల్లవాడికి ఆస్తిలేదు. రెండు వందలు సంపాదిస్తున్నాడన్న మాటేగాని కనుబొమలమీద వెంట్రుకల్లాగా ఎదుగూ బొదుగూలేని ఉద్యోగం. ఇంకా పదేళ్ళు చేసినా అదే జీతం రావచ్చు. లేదూ, రేపే ఉద్యోగం ఊడవచ్చు. ఈ జీతంరాళ్ళల్లో ఇద్దరు తమ్ములకు చదువులు చెప్పిస్తున్నాడు. అందులో ఒకడు కాలేజీ చదువు !... ఇంతాచేసి కుర్రవాడికి పలచని జుట్టూ, మెల్లకన్నూ ! తోలు ఎర్రగా ఉంటే అందగాడై పోయాడా ? ఇన్నిటికన్నా ముఖ్యమైన విషయమేమంటే ఈ సంబంధం కుదిర్చింది శ్వేతాంబరం కానేకాదు. ఆ కుర్రవాడి పినతండ్రి శ్వేతాంబరానికి బాల్యస్నేహితుడు. అందుచేత ఆ అబ్బాయి పిల్లను చూడటానికి తనుకూడా వెంటపెట్టుకు వెళ్ళాడు...

కాని గుణ స్టీమ్‌రోలర్‌ను నడిపించిందంటే దానిముందు ఏ నిజము ఆగలేదు. దాని క్రిందపడి అన్ని నిజాలూ రూపుమాసిపోవలసిందే ! అందుచేత శ్వేతాంబరం

మాట్లాడక ఊరుకునేవాడు.

*   *   *

సీత చాలా విషయాల్లో తండ్రి పోలికే. శ్వేతాంబరానికిగల నిగ్రహమూ, తీక్షణమైన బుద్ధీ వచ్చాయి. అంతేగాక, ఆమె తండ్రిలాగా మానసికంగా ఏకాంతవాసిని. ఆ పిల్ల తండ్రితోగాని, తల్లితోగాని, అక్కతోగాని చెప్పకుండా తన కడుపులో దాచుకున్న ఆలోచనలు చాలా ఉన్నాయి. ఆ సంగతి శ్వేతాంబరానికి తెలీదుగాని గుణమణికి తెలుసు. "మీరు మాట మాట్లాడితే సీతను వెనకేసుకొస్తారుగాని, అది వట్టి కూచి ! దొంగ ! అమ్మో !" అనేదావిడ భర్తతో.

తమకు కలిగిన ఇద్దరాడపిల్లలనూ భార్యాభర్తలిద్దరూ కూడబలుక్కున్నట్టుగా పంచేసుకున్నారు. కళ్యాణి అమ్మ పిల్ల ! సీత నాన్న పిల్ల ! శ్వేతాంబరం భార్యతో "నీ కూతురు" అంటే నూరింట తొంభై పాళ్ళు కళ్యాణి అన్నమాటే. అదే విధంగా గుణమణి కూడా సీతను గురించి మాట్లాడేటప్పుడు— ముఖ్యంగా దెప్పగా మాట్లాడేటప్పుడు — "మీ కూతురు" అని తీరేది.

ఈ పంపకం గురించి సీత చాలా చిన్నతనంనుంచీ ఎరుగును. అంతేకాదు, ఇందులో ఏదో క్రూరత్వం ఉన్నట్టు ఆ పిల్లకు తోచేది.

ఒక్క ఇందులోనేకాదు, భార్యాభర్తల మధ్య ఉండే సంబంధాలూ, తల్లిదండ్రులకూ మధ్య ఉండే సంబంధాలుకూడా అత్యంత క్రూరమైనవిగా సీత బుద్ధికి తోచేవి. తన తల్లీ తండ్రి ఎప్పుడు ఏ విషయం మాట్లాడినా వారి మాటల వెనక ఏదో పరస్పర విద్వేషం దాగి ఉన్నట్టు ఆ పిల్ల తెలుసుకోగలిగేది. వాళ్ళు కూతుళ్ళనిద్దరినీ పంచుకున్నారేమో, ఒకరిమీద ఒకరికిగల తేలిక భావాలూ, కసీ, విసుగూ ఒకరి పిల్లల మీద ఒకరు చూపించుకునేవారు — అది కూడా గోప్యంగానే !

సీత నిత్యమూ ఘర్షణపడే దంపతులనుకూడా చూసింది. కాని అట్లా పోట్లాడుకోవటంకంటే తన తల్లిదండ్రులు సాగించే మూఢయుద్ధం మరింత క్రూరంగా ఉన్నట్టుండేది. "శ్వేతాంబరంగారూ, గుణమణిగారూ కూడా నిజంగా ఎంతో అన్యోన్యంగా ఉంటారు !" అని ఎవరన్నా అనుకుంటూంటే సీత ఆశ్చర్యపోయేది.

ఆ పిల్లమీద తన ప్రభావం ఏమీలేదని గుణమణి బాగానే గుర్తించింది. కాని, శ్వేతాంబరం మటుకు సీత అచ్చు తనలాంటిదే అని ఆత్మవంచన చేసుకునేవాడు. ఒకటి నిజం. సీత మనస్సుమీద తల్లిదండ్రులిద్దరి ప్రభావమూ తక్కువే. జన్మతః ఆమెకు చాలావరకు తండ్రి పోలికలూ కొంతవరకు తల్లిపోలికలూ వచ్చాయి. ఆమె ఎనిమిదేళ్ళు వెళ్ళేదాకా తన తల్లిదండ్రులలో ఎవరు రైటో ఎవరు తప్పో తెలుసుకోలేకపోయేది. ఆ తరవాత ఇద్దరూ చాలావరకు తప్పేననే నిర్ణయానికి వచ్చింది. ఇప్పుడు సీతకి పద్దెనిమిది నిండాయి. ఈ పదేళ్ళుగా ఆమె మీద తల్లిదండ్రులిద్దరి ప్రభావమూ కూడా లేదు.

తాను మానసికంగా దృఢంగా, బలంగా ఉండగలందులకు సీత చాలా

ఏప్పుగా ఎవరూ ఊహించని కృషి చేసింది. ఈ కృషి సఫలమయింది. కాని, దాని ఫలితాలు తల్లికి ఒక విధంగానూ, తండ్రికి ఒక విధంగానూ కనబడేవి. "అది కఠినురాలు, కఠినురాలు" అనేది తల్లి. "నా పోలికే....పట్టుదల....ఉండాలిసిందే !" అనేవాడు తండ్రి. "పట్టుదల ఏం కాదు—మొండితనం !" అనేది తల్లి.

సీత మానసిక దార్ఢ్యంకోసం కృషి చెయ్యటానికి కారణం కళ్యాణే. కాళ్ళలో సత్తువ లేనివాళ్ళు దేన్నయినా ఆనుకుని నిలబడ్డట్టుగా, కళ్యాణి ఎవరినో ఒకరిని ఆనుకునేది. మానసికంగా తనకన్న పెద్దదైవుండి తననే ఆనుకునేది.

ఎవరుకూడా కళ్యాణి మోస్తరుగా ఉండరాదని సీత నమ్మకం. అయితే సీతకు తన అక్కమీద కోపం ఏమీలేదు. ఆమెకు ఎవరి అశక్తతమీదా కోపంలేదు. అక్కడే శ్వేతాంబరానికీ, సీతకూ తేడా. ఇతరుల అసమర్థతవల్ల శ్వేతాంబరం చాలా క్రూరంగా ప్రవర్తించేవాడు. తన భార్య తనకన్న తెలివితక్కువ మనిషి అని తెలిసినాక ఆమె తెలివితక్కువతనాన్ని తన తెలివితో భర్తీ చెయ్యటానికి దాన్ని రెటింపు చెయ్యటానికి తన తెలివితేటలు ధారపోసేవాడు. గుణమణి మామూలు తెలివితేటలుగలవాణ్ణి చేసుకుని ఉంటే ఇంతకన్న రాణించి ఉండేది!.... కళ్యాణి విషయంలో కూడా తండ్రి ప్రవర్తన చాలా క్రూరంగా ఉన్నట్టు సీతకు తోచేది. ఒక ఇంట్లో, ఒక కుటుంబంలో ఉన్న మనుషులు ఒకరినొకరు పరీక్షకు పెట్టి మార్కులువేస్తూ కూచోవటంతోనే సరిపోతే ఇక వీళ్ళు కలిసి జీవించే దెప్పుడు ? ఒకరికొకరు సహాయపడేదెప్పుడు ?

తనను చూసి తండ్రి గర్వపడే సంగతి సీతకు తెలుసు. కాని, అందుకామె పెద్దగా సంతోషించేదికాదు. ఆయన కళ్యాణిని చూసి ఎందుకు అవమానపడేవాడో అందుకే తనను చూసి గర్వపడేవాడు — స్వాతిశయం ! అంతకన్నా ఏమీలేదు. నిజంగా తండ్రి సహాయం ఎక్కువగా కావలసినది కళ్యాణికి. అయినా కళ్యాణి విషయం వచ్చేసరికి తండ్రి చేతులు ముడుచుకున్నట్టుగా ప్రవర్తించేవాడు.

కల్యాణి పెళ్ళి ప్రయత్నాలు విషయం చూడరాదా; ఆయన సరి అయిన ప్రయత్నం చెయ్యటంలేదని తల్లి చేసిన ఆరోపణను సీత కూడా చాలావరకు ఆమోదించింది.

"రేపు సీతకు సంబంధం చూడాలంటే ఇట్లాగే తాత్సారం చేస్తారా ?" అన్నది గుణమణి.

"సీతకి సంబంధం తీసుకురావటానికి అరనిముషం పట్టదు" అన్నాడు తండ్రి.

ఈ మాటకు సీత సంతోషించలేదు. తనకు సులువుగా సంబంధాలు వచ్చే పక్షంలో ఆయన తన సర్వశక్తులూ ధారపోసి తన అక్కకే సంబంధం తీసుకు రావచ్చుగద !

సీతకు ఇంకో విషయం కూడా తెలుసును. కల్యాణికి మంచి సంబంధం రావటానికి తను అడ్డుగా ఉన్నదని తన తల్లి నమ్మకం ! ఆవిడ అట్లా అనుకోవ

టంలో తప్పేమీలేదు. కొన్ని సంబంధాలవాళ్ళు "మీ రెండో అమ్మాయిని చేసు కుంటాం" అని అనటం జరిగింది.

తన అక్కకు చాతయితే సహాయపడాలని సీత ఉద్దేశంగాని, ఆమెకు ప్రతి బంధకంగా ఉండాలని కాదు. కాని తాను చేయగలిగినదేమీ ఉన్నట్టు కనబడలేదు.

"జీవితం ఎంత క్రూరమైనది ! ఎంత నిర్దాక్షిణ్యమైనది !" అనుకున్నది సీత.

*   *   *   *

కల్యాణికి సంబంధం వచ్చింది. వరుడు పాతికేళ్ళవాడు. వాళ్ళకేమీలేదుట. ఇతనుమటుకు రెండువందల యాభై తెచ్చుకుంటున్నాడు. ఈ కాలంలో పొడి బియ్యే అక్షరాలతో రెండువందయాభై తెచ్చుకోవటం ఘనమే. కాని, ఈ అబ్బాయి ప్రకాశం విషయంలో అంత ఘనంగా చెప్పుకొనటానికిలేదు. ఎందుకంటే అతనిపై పెద్ద కుటుంబ భారం ఉంది. అతని అన్న చనిపోయాడు. ఆయన ప్రకాశం కంటె తొమ్మిది పదేళ్ళ పెద్దవాడు. క్రిమినల్ లాయర్‌గా మంచి ప్రాక్టీసుండేది. ప్రకాశం చదువంతా ఆయనే చెప్పించాడు. ఆయనకు అయిదుగురు పిల్లలు-అందులో ముగ్గురు ఆడపిల్లలు ! ఆయన ఆకస్మికంగా చనిపోవటంతో ఆయన కుటుంబ భారం ప్రకాశంపైన పడింది.

"అందుచేత నా సంపాదన నాకు ఏమూలా చాలదు. మా అన్న పిల్లల్లో ఆఖరువాడు తప్ప అందరూ చదువుకుంటున్నారు. నేను న్యాయంగా పెళ్ళి చేసు కోనేరాదు. నే చేసుకోబోయే భార్య తరఫునుంచి ఏదైనా ఆర్థిక సహాయం ఉండే పక్షంలోనే పెళ్ళాడతాను." అని ప్రకాశం పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు కుండ పగలేసి చెప్పాడు.

అతను వెళ్ళటానికి లేచినప్పుడు శ్వేతాంబరం, "సరే, నాయనా ! నువ్వు వెళ్ళి రెండు మూడు రోజులలో నీ నిర్ణయం తెలియజెయ్యి. ఈ లోపల మేం కూడా ఒక నిర్ణయానికి వస్తాం" అన్నాడు.

"నా నిర్ణయం నేను ముందే చెప్పేశాను గద ! అధమం ఇంకో అయిదేళ్ళ పాటు నేను మా అన్న కుటుంబాన్ని పోషించాలి. అప్పటికి పెద్ద కుర్రాడు కాస్త తన కాళ్ళమీద నిలబడగలుగుతాడు. ఆ తరవాత అంత ఇబ్బంది ఉండదు. కట్నంగా ఇచ్చినాసరే, నెలనెలా రెండువందలకు తక్కువ కాకుండా నాకు సహాయం చెయ్య గలిగినా సరే నేను పెళ్ళికి సిద్ధంగా ఉన్నాను." ప్రకాశం చప్పున నవ్వి "ఇది ఒక బేరంకింద అడుగుతున్నాననుకోండి, నాకు వెనక ఆస్తి ఉంటే నేనడిగేదానికి మూడింతలు అడక్కుండానే ఇచ్చి ఉందురు !—కాని, ఇది నా పరిస్థితి. దాన్ని దాచి లాభంలేదు" అన్నాడు.

"సరే. ఆలోచిద్దాం !" అన్నాడు శ్వేతాంబరం.

గుణమణి ఎంతో ప్రయత్నంమీద తననుతాను నిగ్రహించుకుని ఉండాలి. ప్రకాశం గడప దాటగానే ఆవిడ అగ్నిపర్వతంలాగా బద్దలయింది.

"ఛీ ఛీ! ఎంత నాగరికతలేని మనిషి! 'నువ్వూ వద్దు. నీతో సంబంధమూ వద్దు' అని చెప్పేయ్యక, ఆలోచిస్తామంటారేమిటి? ఏమిటుంది ఆలోచించటానికి? ఈ సంబంధానికి నేను చచ్చినా ఒప్పుకోను" అన్నదావిడ.

"ఆ మాటే ఒక కార్డుముక్క రాస్తే పోలా? అతని మొహానే అనాలని ఏముందీ? అది మాత్రం ఏం నాగరికతా?" అన్నాడు శ్వేతాంబరం.

"అటువంటి వాళ్ళతో అట్లాగే ప్రవర్తించాలి!"

ఇది ఆవిడ తరచు అనే మాటల్లో ఒకటి. తనకొక నాగరికత ఉన్నట్టు ఆవిడ ఎప్పుడూ ఒప్పుకునేది కాదు. అవతలి వాళ్ళనుబట్టికూడా ప్రవర్తించాలని ఆవిడ సిద్ధాంతం. ఈ సిద్ధాంతాన్ని శ్వేతాంబరం ఏనాడూ అర్థం చేసుకోలేదు. గుణమణి ఆ సిద్ధాంతాన్ని విసర్జించనూలేదు!

"అతన్ని మర్యాదగా పంపినందువల్ల నష్టంలేదులే. అతను కుండ పగలేసి తన సంగతి చెప్పినట్టే మనంకూడా కుండ పగలేసి మన పరిస్థితి అంచనా వేసుకోవటం మంచిదికాదూ?" అన్నాడు శ్వేతాంబరం.

"ఇది పోగొట్టుకుంటే కల్యాణికి ఇంతోటి సంబంధం మరి రాదనేగా మీరనేదీ?" అన్నది గుణమణి తీవ్రంగా.

"నేనా మాట అనటం లేదుగాని ఈ సంబంధం మనం అనుకున్నంత తీసేసేది కాదని నా ఉద్దేశం" అన్నాడు శ్వేతాంబరం చాలా ఓర్పు అభినయిస్తూ.

"ఇంతకన్న చచ్చు సంబంధం మీరు కావాలన్నా తీసుకురాలేరు!" అన్నది గుణమణి, ఛాలెంజి చేస్తున్న దానిలాగా.

"నా కళ్ళకి కుర్రాడు చాలా అందంగా ఉన్నాడు. అతను కాస్త ప్రయత్నిస్తే ఏ సినిమావాళ్ళయినా ఎగరేసుకుపోవచ్చు!"

"ఇంకేం? ఆపనే చేసుకోమనండి! చాతనయితే మీరుకాస్త సహాయం కూడా చేసిపెట్టండి!"

"కాస్త తాపీగా ఆలోచించవలసిన సమయంలో నువ్వు కాస్త వేడెక్కిపోతావు. నే చెప్పేది కాస్త శ్రద్ధగా విను. ఇతని అన్న నెలకి రెండు వేలు చొప్పున సంపాదించేవాట్ట. ఆయనే ఇప్పుడు బతికుంటే ఈ సంబంధం మంచిదని నువు ఒప్పుకునేదానివేనా?"

"బతికిలేడుగా?"

"ఆ మాట నాకు తెలీదూ?" అన్నాడు శ్వేతాంబరం ఓర్పు కాస్తా పోగొట్టుకుంటూ.

"తెలిసి ఎందుకడుగుతారూ? ఇది మంచి సంబంధమని నాచేత అనిపించటమేగా మీ ఉద్దేశం? ఇతనికి ఓ లక్షరూపాయల ఆస్తి ఉంటే మంచి సంబంధమేనా, అని అడగరాదూ? ఉన్న సంబంధం ఉన్నట్టుగా ఆలోచించాలిగాని అయితేలూ, గియితేలూ ఇప్పుడెందుకంట?" అన్నది గుణమణి.

శ్వేతాంబరం అందామనుకున్న మాట అనే అవకాశమే లేకపోయింది. ఆయన హేతుబద్ధంగా మాట్లాడుదా మనుకున్నప్పుడల్లా గుణమణికి మరింత ఆవేశం వస్తుంది. ఈ సంగతి సీత తన చిన్నతనంనుంచీ కళ్ళారా చూస్తున్నది.

"మనం ఇంత ఘర్షణ పడేకన్న అమ్మాయి ఏమంటుందో తెలుసుకోవటం మంచిదికాదూ!" అంటూ శ్వేతాంబరం కల్యాణికేసి చూశాడు.

కల్యాణి ఒక్కసారి తల్లివంక చూసి, "ప్రైవేట్ మాస్టర్ని పెట్టినట్టు నెల జీతం మీద నాకు మొగుణ్ణి పెడతారా? నాకిష్టంలేదు. ఆ మనిషి అంత స్పష్టంగా డబ్బుకోసం పెళ్ళిచేసుకుంటుంటే నేనెట్లా ఇష్టపడతానూ?" అన్నది.

శ్వేతాంబరానికి ఓర్పు కాస్తా పోయినట్టుంది. "నాకు తెలీకడుగుతాను నీ అందం చూసి మురిసి చేసుకునేవాడే అయితే వాడేపాటి అందగాడై ఉంటాడు. ఇంకోరి బండారం ఎంచేముందు మన బండారం కూడా ఎంచుకోవాలిగా" అన్నాడతను.

"అట్లా అయితే దాని ఇష్టం ఎందుకడుగుతారూ? డబ్బుంది గనుక దానికొక మొగుణ్ని కొనిపారెయ్యండి. ఉద్ధరింపు అవుతుంది. అసలు మనకున్న సంస్కారమే అంత! అంతకంటె ఎక్కువ ఉన్నట్టు నటించటం కూడా దేనికి?" అన్నది గుణమణి.

"ఒకవేళ ఆ ప్రకాశం కోరిన షరతులు ఒప్పుకుని పెళ్ళి నిశ్చయించా ననుకో, నేను నా కూతురికి పనికిమాలిన సంబంధం చేశానని నలుగురూ నన్నాడి పోస్తారా!" అని అడిగాడు శ్వేతాంబరం.

"నలుగురూ అనుకునేదానికి, పెళ్ళాం పిల్లలు అనుకునేదానికి ఏమీ తేడా లేదా?"

"పెళ్ళాం పిల్లలు పైత్యానబడి తెలుపును నలుపంటే దాన్ని శిరసావహించాలి సిందేనా?"

"ఇక వీళ్ళు ఒకరికొకరు ప్రశ్నలుతప్ప వేసుకోలేరు" అనుకున్నది సీత. తన తల్లిదండ్రుల ఘర్షణలో వివిధ దశలు ఆ పిల్లకు కొట్టిన పిండి.

"ఎందుకండీ ఈ డొంకతిరుగుడు మాటలూ! ఈ సంబంధమే సీతకు వస్తే ఇంత ఆత్రంగా ఒప్పేసుకుంటారా?" అని అడిగింది గుణమణి. ఆవిడ అంచనా ప్రకారం ఇది తన భర్తకు మర్మాఘాతం! పడికట్టు రాళ్ళలాగా ఆవిడకు ఇటువంటి ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. వాటిని ఆవిడ చాలా "టాక్టికల్"గా ఉపయోగించేది. ఒక్కొక్కసారి అవి ఫలితాలిచ్చేవికూడానూ.

"అయితే గియితేలు నీకు సుతరామూ సరిపడవుగా?" అన్నాడు శ్వేతాంబరం వెటకారంగా.

"నేనడిగినదానికి సమాధానం చెప్పరేం?" అన్నది గుణమణి.

"నాకు నువ్వనుకునే పక్షపాతాలేమీలేవు. సీతకు సమ్మతమైతే నేనభ్యంతరం చెప్పను" అన్నాడు శ్వేతాంబరం.

"దానికి ఇష్టంలేదంటే శాపనార్థాలు పెట్టరుగా?" అన్నది గుణమణి.

శ్వేతాంబరం ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. తనకి సంబంధం ఇష్టంలేదని కల్యాణి అనగానే చర్చ ముగించి ఉంటే ఆయనకింత విపత్తు రాకపోదు!

తలవని తలంపుగా సీత ఆయనకు సహాయం వచ్చింది.

"నేనైతే ఈ సంబంధానికి ఒప్పుకుంటానమ్మా!" అన్నది సీత.

గుణమణి ఏదో అనటానికి నోరు తెరిచింది. కాని ఏమీ అనలేదు.

"అక్కకి మరొక సంబంధం చూచి పెళ్ళి చేసేదాక ఇతను ఉండేట్టయితే నేను తప్పక చేసుకుంటాను. తనకు అన్న చదువు చెప్పించినందుకు కృతజ్ఞత కల వాడు బొత్తిగా మొరటుమనిషి అయియుండడు. మనకన్న నయమే అనుకుంటాను. అయినవాళ్ళమీద అపేక్ష చూపేవాళ్ళను గురించి మనం — మనం వేళాకోళంగా మాట్లాడుకోవటం నాకేం బాగాలేదు." అంటూ సీత కూర్చున్న చోటినుంచి లేచి అవతలికి వెళ్ళిపోయింది. మిగిలిన ముగ్గురూ ఆ పిల్లకేసి నోళ్ళు తెరుచుకు చూస్తూ ఉండిపోయారు.

ప్రచురణ : కొడవటిగంటి కుటుంబరావు కథలు, కథల సంపుటిలో.
జయా పబ్లికేషన్ : విజయవాడ.